
అర్థం కాలేదనుకొంటాను. నాతో అన్నట్టు కాకుండా, తనలో అనలే కాకుండా చెప్పేస్తున్నాడు:

"ఓ, ఇదా? ఇది చారులత! సోనాగా చీ నందులో పచారీ కొట్టు మనిషి-మధుకర్‌ఘోష్‌గారు కొన్నాళ్ళు ఉంచుకున్నారు. అతగాడి పెళ్ళాం చచ్చిపోయాక తనని పెళ్ళి చేసుకోమని వెంటబడింది. అతను వదిలించుకున్నాడని అలిగి బ్రోతల్ వ్యాపారం ప్రారంభించి మాతాజీ అయింది. నేను ఆ ఏరియాలో పనిచేసినప్పుడు రెండుసార్లు అరెస్టు చేశాను. దాదాలకీ, దీనికీ వంపకాల దగ్గిర ఎప్పుడూతగాదాలే! చివరికి ఎవడో ఇలా పుణ్యం కట్టుకున్నాడన్న మాట. చెడ్డ కథకి చెడ్డ ముగింపు—"

ఇన్‌స్పెక్టర్ కథ పూర్తిచేస్తూ ఉండగానే గేట్లోంచి త్రీ నాట్ సిక్స్ ఓ చేత్తో వి.ఐ.పి. సూట్‌కేసు, మరో చేత్తో ఎవడిదో మెడ పట్టుకుని లోపలికి ప్రవేశించాడు.

వెంకట్ తన సూట్‌కేస్ తెరిచి అన్నీ ఉన్నాయో లేదో చూసుకునే హడావిడిలో ఉండగానే, నేను నా సూట్‌కేసులోంచి చీర తీసి, మడతలన్నీ విప్పి, ఆ చాప చుట్ట మీద కప్పి, "నాకు సెలవిప్పించండి మరి" అన్నాను ఎవర్నీ చూడకుండా-అందర్నీ ఉద్దేశించి. ●



మినీకథ

# ఈనాటి కథ

గొల్లపూడి మృణాళిని

ఆ రోజు జమదగ్ని కూతుర్ని చూసుకోవటానికి పెళ్ళివారు వచ్చారు.

రేవతిని ముస్తాబు చేసి కూర్చోబెట్టారు.

పేరు, చదువు, సంగీతం, అలవాట్లు, అభిరుచులు అన్నీ లాంఛనంగా జరిగిపోయాయి.

పెండ్లికొడుకు తండ్రి శతకీర్తి కొన్ని విషయాలలో జాప్యం భరించలేడు. అందుకే కుండ వగలకొట్టినట్లు చెప్పేశాడు.

"బావగారూ? మీ అమ్మాయి మా అందరికీ నచ్చింది. మిగిలిన విషయాలు ఇప్పుడే, ఇక్కడే మాట్లాడేసుకుందాం. ముందు అమ్మాయి అభిప్రాయం కనుక్కోండి" అన్నాడు.

సమయం తానకి తందానతాళం వేసింది. అయితే ఇంకేం శుభస్య శీఘ్రం అనుకున్నారు పెద్దలు. ముప్పయివేల రూపాయలు కట్నం, మిగిలిన లాంఛనాలు అన్నీ క్షణాల మీద నిశ్చయమైపోయాయి.

పెళ్ళి పందిట్లో మరచెంబులో ఉన్న నీళ్ళతో పెళ్ళికొడుకు కాళ్ళు కడుగాల్సిన జమదగ్ని ఉబికి వచ్చే కన్నీళ్ళతో వియ్యంకుడి కాళ్ళు కడిగేశాడు.

సారాంశం కట్నండబ్బు సమయానికందక పదివేలు మినహాయింపు! అందుకు ఫలితంగా పీటలమీద పెళ్ళి ఆపవద్దని ప్రాధేయపడటం.

అందరి .గుండెల్లోనూ రైళ్ళు పరిగెడుతున్నాయి- ఈనాటి కట్న కానుకల లోటుకి ఫలితాలు తెల్సుకనక.

ఫెళ్ళున నవ్వేశాడు శతకీర్తి హుందాగా.

"నాకు ఆడపిల్లలు లేకపోయినా ఆ సాధక బాధకాలు బాగా తెలును. అమ్మాయిని కాపరానికి పంపేటప్పుడు మిగిలింది ఇచ్చి పంపుదురుగాని ముందు ముహూర్తం కానివ్వండి,' అన్నాడు మర్యాదగా.

అందరి మనసులు తేలికపడి, శతకీర్తి మంచితనానికి అబ్బురపడి "వాయించండోయ్ మేళాలు" అన్నారు ఉత్సాహంగా.

ఫెళ్ళున రేవతి పెళ్ళయిపోయింది.

* * *

పసుపు చెంబు, చలిమిడితో మాత్రమే రేవతి కాపురానికి వచ్చింది భయపడుతూనే.

"బావగారూ? సమయానికి సర్దుతాం అన్నవాళ్ళు సర్దకపోవటంతో ఆలస్యం జరిగిపోయింది. ఒక్క నాలుగు నెలలు గడువు ఇవ్వండి చాలు. ఆ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను. ఇవి చేతులు కావు" అన్నాడు జాలిగా జమదగ్ని.

"ఈ మాత్రానికేనా? మరేం పరవాలేదు చేతికి రాగానే ఇవ్వండి" అన్నాడు శతకీర్తి.

తేలిగ్గా ఊపిరిపీల్చుకున్నాడు జమదగ్ని.

* * *

పూవులు కాయలై, కాయలు పళ్ళై మిగలముగ్గి రాలిపోయినా జమదగ్ని ఆడిన మాట నిలబెట్టుకోలేదు.

"ఏమండీ ఇంకా ఎంతకాలం ఆ పది వేలకూ కుంటిసాకులు చెబుతారు? వాళ్ళు మంచి వాళ్ళు కాబట్టి సరిపోయింది. ఇదే మరొకరు అయితేనా" అంటూ భర్తను ఓసారి హెచ్చరించింది జమదగ్ని భార్య.

"ఓసి పిచ్చి మొహమా? వాళ్ళు మంచివాళ్ళు కాబట్టే ఆ డబ్బు ఎగ్గొట్టే ప్రయత్నం. చూడు అమ్మాయి పెళ్ళయి ఏణ్ణర్థం అయినా ఆ డబ్బు గురించి ఒత్తిడి చేయలేదు. పైగా తనను పల్లెత్తుమాటైనా అనకుండా పువ్వుల్లో పెట్టి కన్నకూతురి కంటే ఎక్కువగా చూసుకుంటున్నారు' అని అమ్మాయే స్వయంగా చెప్పింది. ఇంక ఆ విషయం ఎత్తకు" అన్నాడు తెలివిగా.

"అయ్యో రామా! మర్యాదస్థులతో నటండీ పిల్లాటలు? వాళ్ళకు ఏ కోపం అయినా వచ్చి అమ్మాయిని పంపిచేస్తేనో' అంది ఆడ మనసు కాస్తంత అనుమానంగా.

"అలా ఎన్నటికీ జరగదు. వాళ్ళు అలాంటి మనుషులు కాదే. చూడు ఆ పది వేలకీ మరో పది వేలు కలిపితే ఆఖరిదాని పెళ్ళి చేసెయ్యొచ్చు. అదీ నా ప్లాను."

"ఆ!" అంటూ భర్త తెలివికి తెల్లబోయి బుగ్గలు నొక్కుకుంది.

* * *

"రేవతీ డైడ్. స్టార్ట్ ఇమీడియెట్‌లీ" అంటూ వచ్చిన టెలిగ్రాం చూసి గొల్లున ఏడుస్తూ ప్రయాణమయ్యారు జమదగ్ని దంపతులు.

రేవతి శవం మీద. పడి అధదాని కన్నా హీనంగా ఏడుస్తున్నాడు భర్త. అత్తమామలు తల బద్దలు కొట్టుకుంటూ చనిపోయిన రేవతి తమ కూతురే అన్నంతగా దుఃఖపడుతున్నారు.

జమదగ్ని దంపతులే శోకం దిగమింగుకుని వాళ్ళని ఓదార్చాల్సి వచ్చింది.

"అక్కడికీ చెబుతూనే ఉన్నాను. వద్దు తల్లీ, ఆ టెర్లిన్ చీరతో స్టౌ దగ్గరకు పోవద్దు అమ్మా అని" అంటూ గోలు గోలున ఏడుస్తోంది అత్తగారు.

"పాపం ఎంత దురదృష్టమో! ఆ పిల్లని ఏనాడూ చిన్న మాట అని ఎరగరు. కూతురు కంటే ఎక్కువగా చూసుకున్నారు. ఇలాంటి అత్తమామలూ, భర్తా నూటికో, కోటికో ఒకళ్ళు ఉంటారు." చుట్టుపక్కల వాళ్ళు సానుభూతి చూపిస్తున్నారు.

శతకీర్తి దంపతులను, కొడుకును ఓదార్చటం ఎవరి తరం కాలేదు.

రేవతి శవంతో పాటు తను కూడా చచ్చిపోతానంటూ సహగమనానికి సిద్ధపడ్డ ఆమె భర్తను ఆపటం బ్రహ్మప్రళయమే అయింది.

కూతురు పోయిన బాధ కంటే, ఆమె పట్ల వియ్యాలవారికున్న ప్రేమకు ఊరివాళ్ళతో పాటు అబ్బురపడ్డా రా దంపతులు.

* * *

రేవతిపోయి అవాళ్టికి పదిహేనవ రోజు.

వియ్యాలవారి ఊరి నుంచి మనిషి వచ్చాడంటే బయటికి వచ్చాడు జమదగ్ని.

"అయ్యా! నన్ను తమ వియ్యంకుడుగారు పంపించారు. రేపు రాత్రి పది గంటలకు మీ అల్లుడి పెళ్ళి. గొప్పింటి సంబంధం. అబ్బాయికి, తలిదండ్రులకి అమ్మాయి బాగా నచ్చింది. కట్నం యాభై వేలు. మోటారు బైకు, కలర్ టి. వి. ఇంకా ఏవేవో ఇతర లాంఛనాలు. వారి ఉత్సాహం చూస్తుంటే నాకే అసూయగా ఉంది సుమండీ. కట్నం డబ్బు నయాపైసా బాకీ లేకుండా ముందే ఇచ్చేశారుటండీ! మిమ్మల్ని మాత్రం పెళ్ళికి తప్పకుండా బైలుదేరి రమ్మన్నారు" అంటూ చల్లగా జారుకున్నా డా మనిషి.

అప్పటికి మెదడులో లైట్ వెలిగింది. "అమ్మ శతకీర్తీ, ఎంత తేనె పూసిన కత్తివి" అంటూ విస్తుపోయాడు కూతురి చావుకి అసలు కారణం అర్థమైన జమదగ్ని. ●